కథానిక:

అనుభవం

శ్రీ ఊరంకి వెంకటరావు

మొన్న వేసంగిలో సాయంకాలం పూట ఏమీ తోచక కొట్టుకునేవాణ్ణి. పగలల్లా ఎండమూలాన్ని ఎక్కడికీ కదలడానికి వీలు లేదు గదా—అందుకని గదిలోపల కూర్చుని ఏ పాత పత్రికలు చదువుకుంటూనో, వరండామీద చేరిన నలుగురు రౌడీవాళ్లూ చెప్పుకునే కబుర్లు వింటూనో నిద్రపోయేవాణ్ణి. నాకు ధైర్యం లేదు సరికదా, ఆడవాళ్ళని చూస్తే అమితమైన జంకు. మా కృష్ణమూర్తి అలా గాదు. వాడైతే వెళ్ళిన సరాసరి ఆడవాళ్ల మధ్యనే కూర్చోగలడు. "ఈవేళ మీ యింట్లో ఏం వొండుకున్నారు?" అనే ప్రశ్న దగ్గరనుంచి వైకుంఠపాళీ ఆటలో దెబ్బలాడే వరకూ వాడు ఆడవాళ్ళలో ఒకడై కూర్చుంటాడు. కూర్చోగలడు. నాకు అది చేతగాదు కాబట్టి నిదరపోయేవాణ్ణి.

అది పొట్టి పల్లెటూరు గాబట్టి కొన్నాళ్ళ పాటు సాయంత్రం గూడా ఏమీ తోచేదిగాదు. కాని రామమూర్తి పంతులుగారితో పరిచయం ఐన దగ్గరనుంచి అట్టే బాధ అనిపించలేదు. ఆ వూళ్ళోవుండటం. రోజూ సాయంత్రం అయినా, నేనూ ఏ తోటలవేపో, పొలాలవైపో షికారు పోయే వాళ్ళం. ఆయన నాకు అనేక విషయాలను గురించి చెబుతూవుండేవాడు.

రామమూర్తిగారు ఒక రిటైరయిపోయిన హైస్కూలు మేష్టరు. పెళ్ళాం పోయింది. కూతుళ్ళందరూ కాపరాలు చేస్తున్నారు. కొడుకులు ఉద్యోగాలు చేస్తున్నారు. ఆయన మాత్రం పిత్రార్జితం పొలాలు చూసుకుంటూ ఆ పల్లెటూళ్ళో వున్నాడు. ఆయనకు ఇంట్లో వొండి పెట్టడానికి ఒక చెల్లెలు, వెధవావిడ వుంది. మొత్తానికి ఆయన ముసలికాలంలో ఏ చీకూ, చింతా లేకుండా హాయిగా వున్నాడు. నేను మా మేనత్తగార్ని గురించి అవూరు వెళ్లబట్టి ఆయన పరిచయం అయింది

ఒకరోజు సాయంత్రం నేనూ, పంతులుగారూ వాళ్ల పొలాలవైపు నడిచివెడుతున్నాం. మాకు దారిలో ముగ్గురు స్త్రీలు ఎదురువచ్చారు. ముగ్గురూ క్రైస్తవులే. వారి చేతుల్లో పుస్తకాల్ని బట్టి, గొడుగుల్ని బట్టీ వాళ్ళు పంతులమ్మలై వుంటారని మేము గ్రహించాము. వాళ్ళల్లో పెద్దావిడ పంతులుగారి వేపూ, మిగతా యిద్దరు యువతులు నాకేసీ తీక్ష్ణంగా చూస్తున్నారు. వారు మమ్మల్ని దాటి వెళ్ళిపోయేటప్పుడు ఇంచుమించుగా మమ్మల్ని రాసుకు వెళ్లినంత పనైంది. ఆ యిద్దరు యువతులూ నాకేసి అంత తీక్ష్ణంగా చూస్తుంటే నేను వారికేసి చూడలేక తలదించుకున్నాను. పక్కని పంతులుగారున్నారనే జంకొకటి. పైగా వాళ్ళది మెజారిటీ. పంతులుగారు మాత్రం నిశ్చయంగా, నిశ్చలంగా తనకేసి చూస్తున్నావిడకేసీ, క్రీగంట నాకేసి చూస్తున్న వాళ్ళకేసీ చూస్తున్నాడని నేను కనిపెట్టకపోలేదు.

మేమిద్దరమూగూడా మార్గమందు జరిగిన యీ క్షణిక సంఘటనగూర్చి నోరు మెదపలేదు. కాని యిద్దరితలల్లో గూడా ఆ స్త్రీలు, వాళ్లకి సంబంధించిన స్త్రీజాతి, స్త్రీజాతికి సంబంధించిన అనేక విషయాలు మెదిలాయని మాత్రం గట్టిగా చెప్పగలను. ఇద్దరమూ నడుస్తున్నామన్నమాటేగాని, ఆ పని అప్రయత్నంగా మా కాళ్ళు చేస్తున్నాయి. మేమిద్దరమూ అప్రయత్నంగా నడుస్తున్నామనే విషయంగూడా పంతులుగారి పొలాల దగ్గరకు చేరుకున్నాక "ఇవే మా పొలాలు" అని ఆయన అనేవరకూ నాకు గుర్తు లేదు.

"ఈ మఱ్ఱిచెట్టుక్రింద కూర్చుందామా?" అన్నాడాయన. "మీ యిష్టం. అలాగే" అన్నాను నేను.

ఇద్దరమూ మఱ్ఱిచెట్టుక్రింద కూర్చున్నాము. నాకు మాట్లాడటానికేమీ కనబడటంలేదు. నా ఊహాలన్నీ నే నెరుగున్న స్త్రీల తత్వాలమీద పరుగెడుతున్నాయి.

పంతులుగారే సంభాషణ మొదలెట్టారు. "చూశావుటోయ్ ప్రకాశం, దారిలో మనకు కనపడ్డ క్రైస్తవ యువతులు ఎంత ధైర్యంగానూ, ఎంత అమాయకంగానూ వున్నారో! వాళ్ళు మనకేసి నిర్మలమైన దృష్టితో, నిశ్చలంగా చూశారు. వాళ్ళు అలాగ చూస్తుంటే మనమే ముఖం దించేసుకున్నాం. ఎందువల్ల? మనలో ఆ నిర్మలత లేదుగబట్టి."

"అంతేనంటారా?" అన్నాను అప్రయత్నంగా. "ఆ ముమ్మాటికీ అంతే. కొంతమంది స్త్రీలు ఎంతో బెదురుబెదురుగా వుంటారు. మనం అదంతా అణకువ అనీ, అదే స్త్రీకి అందమనీ అనుకుంటాము. కాని అలా బెదురు, బెదురుగా వుండేవాళ్ళే అవసరం వస్తే ఏ పనైనా చేస్తారు. వాళ్ళు అలా చేస్తారంటేగూడా మనం నమ్మలేని స్థితిలో ఉండేటట్టు వాళ్ళు చేస్తారు." అన్నాడాయన. "నేను మీతో ఆట్టే ఏకీభవించలేను" అన్నాను. లోపల బాధపడుతూనే ఆమాట అన్నాను—"అయ్యో, పెద్దవాడిమాట తోసివేస్తున్నా మే" అనుకుంటూ.

"అదుగో నీకూ నాకూ తేడా అక్కడే వుంది. నువ్వేమంత పెద్దవాడివనిగాని, నీకేమంత స్త్రీలతో పరిచయ ముందనిగాని, ఆ మాట అనగలవు? ఇక నా విషయమా, స్త్రీల తత్వాన్ని పరీక్ష చెయ్యటంలోనే నా బుర్ర నెరిసిందనుకో. ఇంట్లో కట్టుకున్న పెళ్ళాం తత్వం దగ్గరనుంచి, క్లాసులో నాదగ్గర చదువుకునే ఆడపిల్లలతత్వం దగ్గరనుంచి అందరి తత్వమూ కూలంకషంగా గ్రహించా ననుకో" అన్నారు పంతులుగారు సగర్వంగా.

నే నొక చిరనవ్వు నవ్వాను. పంతులుగారు మళ్ళీ అందుకున్నారు. "నాకు చిన్నపుడు పెళ్ళిగాకముందు జరిగిన దొక అనుభవం నీతో చెబుతా విను. ఆ సంఘటన తలుచుకుంటే అది ఇప్పటికీ కళ్ళకు కట్టిన ట్టుంటుంది.

"నాకు 24 ఏళ్ళ వయస్సున్నప్పుడు నేను బెజవాడ హైస్కూల్లో కొత్తగా మేష్టరీ ఉద్యోగంలో ప్రవేశించాను. అప్పటికి నేను బి. ఏ. మాత్రమే ప్యాసయాను. ఇంకా యల్. టి. ప్యాసవలేదు. అప్పుడు నలభైరూపాయ లిచ్చేవారు. ఇంకా పెళ్ళి అవలేదు గాబట్టి, సంసార బాధ్యత నెత్తిమీద పడలేదుగాబట్టి ఆ డబ్బు నాకు బెజవాడలో ఆ రోజుల్లో సరిపోయేది. ట్యూషన్లవల్ల పాతికో, పరకో ఏదైనా వస్తే ఇంటికి పంపించేవాణ్ణి.

"బెజవాడలో నా గదికి ఎదురుగుండా ఒక పార్సీ వ్యాపారస్థు డుండేవాడు. అతను అప్పటికి పన్నెండేళ్లబట్టి ఆ వూళ్లో వ్యాపారం చేస్తున్నాడు. తెలుగు బాగానే మాట్లాడుతాడు. నేను ఆ వీధిలో గది తీసుకున్నానుగాని, ఇంటి పక్క ఎవరున్నారో, ఇంటి కెదురుగుండా ఎవరున్నారో, యీ విషయాలేమీ పట్టించుకునే వాణ్ణి గాదు. రెండుమూడు నెలలు పోయాక నా గది అరుగుమీద ఒకరోజున కూర్చుండగా, ఎదురుగుండా వున్న యింట్లోంచి ఆ పార్సీ వర్తకుడు నా దగ్గర కొచ్చి కూర్చున్నాడు. నేను ఆశ్చర్యపోయాను. కాని, అతనెంతో పరిచయమున్నవాడిలాగ తన సంగతంతా చెప్పుకొచ్చాడు. తన ఇంట్లో తన భార్య, తనూ, తన బావమరదీతప్ప ఇంకెవరూ లేరనీ, బావమరది తనకి వ్యాపారంలో చాలా సాయం చేస్తూ వుంటాడనీ, వాళ్ల ఇంట్లో అందరికీ బాగా తెలుగు వచ్చుననీ, ఇప్పుడు తన కున్న భార్య రెండోపెళ్లి పెళ్లామనీ, చాలా మంచిదనీ ఇంకా అనేకం చెప్పాడు.

"తరువాత అతను నా విషయంలోకి వచ్చి నన్ను ఆ గదిలో దిగిన దగ్గర్నుంచీ తనూ, వాళ్ల ఇంట్లో వాళ్ళూ కనిపెడుతున్నారనీ ఒకరి జోలి, ఒకరి ప్రసక్తి లేకుండా నేను వుండటం వాళ్ళకి ఆశ్చర్యం కలగజేసిందనీ, నేను స్నేహపాత్రుడుగా వాళ్ళకు కనబడ్డంచేత నాతో స్నేహం చెయ్యటానికి తను వచ్చాననీ చెప్పాడు. తరువాత నేనుకూడా అతనితో చాలా చనువుగా మాట్లాడుతూ నా చరిత్రంతా చెప్పాను."



దాల్ సరస్సులో స్వాతంత్ర్యోత్సవాలను చూస్తున్న షేక్ అబ్దుల్లా, పండిట్ నెహ్రూ, మౌలానా అజాక్.

పంతులుగారు చెప్పినది ఇంతవరకూ శ్రద్ధగా విన్నానుగాని. ఇంక వినలేమో ననిపించింది. ఎందువల్లనంటే ఆయన స్త్రీల మనఃప్రవృత్తుల్ని గురించి చెబుతానని మొదలెట్టి, తన ఆత్మకథ చెబుతున్నాడు పంతులుగారు నాలో ఆసక్తి తగ్గిపోయిందని కనిపెట్టకపోలేదు.

"నేను చెప్పేదాన్ని గురించి నీకు శ్రద్ధ తగ్గిపోయినట్టుగా కనిపిస్తోంది. ఇదిగో అసలు విషయానికే వస్తున్నాను. ఆ వేళనుంచీ ఆ పార్సీ ఆయన శని, ఆదివారాల్లో నన్ను వొదిలిపెట్టేవాడు గాదు. వాళ్ళ యింటికి తీసుకుపోయి ఫలహారాలు, టీ యిచ్చేవాడు. గ్రామఫోను వేసేవాడు. నిజంగా చాలా మంచిమనిషి. నావల్ల అతనికి యీషణ్మాత్రమైనా ఉపకారం లేదు. కాని నేనంటే వెర్రి అభిమానం. అతని భార్య గూడా ఎప్పుడూ మాతోనే వుండేది. ఆమెకు ఇరవైసంవత్సరాల వయస్సుంటుంది. అతనికి నలభై. ఆమె నన్ను పరాయివాడుగా చూసేది గాదు. వాళ్ళంతా నన్ను రామ్ జీ అని పిలిచేవారు.

"కాని ప్రకాశం నీతో నిజం చెప్పొద్దూ— ఆమె అందం నన్ను వెర్రివాణ్ణి చేసేదోయి. అబ్బ ఆమె ఎదురుగుండా వుంటే నా నోటి వెంట మాటవచ్చేది గాదు. అంత ఆనందంగా వుండేది. కళ్లు విప్పి ఆమెను చూస్తుంటేనే ఏదో సంతృప్తిగా వుండేది. ఆమె కూడా నా కేసి అలాగే చూసేది. ఆమె నన్ను చూపులతో తినేసేది. ఇప్పుడంటే నేను యిలాగ వున్నానుగాని, ఆ రోజుల్లో చాలా బాగుండేవాణ్ణి.

"వాళ్లతో పరిచయమయాక మరో నాలుగు నెలలు హాయిగా నూ, బాధగా నూ గడిచిపోయాయి. వాళ్లయిల్లు వదిలి నా గదికి వస్తే అంతా బాధే. నరకంలోకి వచ్చినట్టుండేది. బ్రహ్మచర్యం చాలా కష్టమనిపించేది. స్కూల్లో కూర్చున్నా నాదృష్టి ఆమెమీదే వుండేది. నన్ను పూర్తిగా పిచ్చివాణ్ణి చేసింది. ఆ పార్సీ వాళ్ల పరిచయం అవకపోయినా బాగుండేదనిపించింది.

"ఒకరోజున తెలుగుసంవత్సరాదికి గాబోలు, మా స్కూలుకు శలవైతే హోటల్లో భోజనంచేసి వచ్చి గదిలో కూర్చున్నాను. ఆపార్సీవాళ్ల యింటి దగ్గరనుంచి నన్ను రమ్మని కబురు వచ్చింది. నేను వెళ్ళాను. ఇంట్లో మగవాళ్ళెవరూ లేరు. ఆపార్సీ ఆయన వర్తకంపనిమీద మద్రాసు వెళ్ళాడు. అతని బావమరది షాపులో వున్నాడు. భోజనం షాపుకే వెళ్తుందిట. ఇంట్లో ఆమెగాక మరెవ్వరూ లేరనే సంగతి ఆమె చెప్పేవరకూ నాకు తెలియదు.

"నాకు ఏమీ తోచటంలేదు. మీకు యీవేళ శలవని తెలిసి కబురంపించాను. ఇక్కడ వుంటారా?" అన్నదామె.

"నాకు మీ మగవాళ్ళు ఎవరూ ఇంట్లో లేకుండా రావటానికి ఇష్టంగాలేదు. కాని మీరు తోచడం లేదంటున్నారు కాబట్టి నేను వుంటాను" అన్నాను.

"ఆమె సంతోషించింది. లేచి వెళ్ళి వీధి తలుపులు వేసి వచ్చింది. ఆమె మాటల్లో, నడకలో ప్రవర్తనలో వున్న మార్దవం, విలాసం, బెదురు నన్ను తన్మయుణ్ణి చేశాయి.

"ఇలాగరండి, లోపలికి వెడదాం" అని ఆమె నన్ను లోపలికితీసుకెళ్లింది. ఒకపక్క చూపించి "మీరు ఇక్కడ విశ్రమించండి; నేను మీ కుపాటపాడి వినిపిస్తాను" అన్నది. ఆమె వీణ తీసుకుని ఒక హిందూస్తానీపాట, ఒక తెలుగు పాట కూడా పాడింది. నేను తన్మయుణ్ణయాను. నాలో అనేక పాడు కోరికలు రేకెత్తాయి. నేను తలచుకుంటే ఆమెను ఏమైనా చెయ్యగలను. కాని నాలో నైతికదృష్టి చచ్చిపోలేదు. అదే నన్ను అప్పుడు ఆపింది.

"ఆమె పాట ఆపి వచ్చి నా పక్కలో కూర్చుంది. నేను ఆశ్చర్యపోయాను. అది కలా, నిజంగా జరుగుతోందా అనిపించింది. నేను మాట్లాడలేకపోయాను. ఆమెమరీ దగ్గరగా జరిగి తన బుగ్గలు నా చెక్కిళ్ల కాన్చించి. అలాగ ఇద్దరం కొంతసేపు తన్మయత్వంలో వున్నాము. ఆమెను నేను దగ్గరగా తీసుకోబోయాను. ఆమె అడ్డుపెట్టింది.

"తప్పు. మనం మానవుల్లా ప్రవర్తించాలి. నేనుకోరే సుఖమిదే. మీస్పర్శాసుఖం, మీ దర్శనం, మీతో సంభాషణ, యివి నాకు ఎంతో సుఖాన్నిస్తాయి చాలు" అన్నదామె.

"నాకు వొళ్ళు మండిపోయింది. ఆమే నన్ను అంతవరకూ వచ్చేదాకా ప్రేరేపించింది. ఇక ఆఖరు క్షణంలో "మనం మానవుల్లా ప్రవర్తించాలి." అని నీతులు చెప్పబోతుందా, అంత నీతిగలది మానవుల్లా గేమిటి, మానవాతీతురాలుగా ప్రవర్తించడానికి అభ్యంతరమేమిటి? అనిపించింది. వెంటనే అక్కడనుంచి నా గదికి వచ్చేశాను. మరో వారంరోజులలో నాగది ఆ వీధి నుంచి మార్చేశాను. మళ్ళీ ఆమె మొగం చూడలేదు. ఆమె నా కెంత ఆశాభంగం కలుగచేసింది! పైగా నాకు నీతులు చెప్పబోయింది. ఆనాటి బ్రహ్మచారిరోజుల్లో ఆమె మాటలు నాకు చాలా కోపాన్ని కలిగించాయి కాని ప్రకాశం. ఆమె చెప్పినదాంట్లో చాలా సత్యం వుంది. ఏమిటో ఆమె ఒకరకం తత్వం గల స్త్రీ. స్త్రీ హృదయం తెలుసుకోటానికి ఒక జీవితం చాలదేమో ననిపిస్తుంది."

అని పంతులుగారు ఆగారు. ఆయన ఆ సంఘటన చెబుతున్నంతసేపూ నేను ఆశ్చర్యంలో మునిగి తేలుతున్నాను. దారిలో మాకు ముగ్గురు యువతులూ కనిపించకపోతే యీయన యీ చరిత్ర బయటకు రాదుగదా అనుకున్నాను.

"పదండి, ఇళ్లకుపోదాం, చీకటి పడుతోంది" దన్నాను. ఇద్దరమూ లేచి వూరివైపు నడిచాం.